జాతీయ తెలుగు దినపత్రిక



# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం | 12 | జూన్ | 2026 ◆ పేజీలు : 4

## గిరిజన మ్యూజియం, భద్రగిరి మార్ట్ ల నిర్వహణ అభినందనీయం

- ఇన్స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్మెంట్ సెంటర్ హెడ్ సుభాష్ చంద్ర గౌడ్



**భద్రాచలం టౌన్ , జూన్ 11, ప్రజా జ్యోతి** ఆదివాసి గిరిజన మహిళలు రైతులకు ఆర్థికంగా చేయూత అందించడానికి ఐటీడీఏ ఆధ్వ ర్యంలో మిగతా 2 లో...



# నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమంపై ఎమ్మెల్యే జారె ప్రత్యేక చొరవ

- సచివాలయంలో డిప్యూటీ సీఎం, మంత్రులతో వరుస భేటీలు
- నియోజకవర్గానికి భారీ నిధులు, ప్రజా సంక్షేమమే లక్ష్యం
- అభివృద్ధి అజెండాతో హైదరాబాద్‌లో కీలక సమావేశాలు

**దమ్మపేట, జూన్.11, (ప్రజాజ్యోతి) :** అశ్వారావుపేట నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ హైదరాబాద్‌లోని తెలంగాణ సచివాలయంలో కీలక సమావేశాలు నిర్వహించారు. రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు పలువురు మంత్రులను కలిసి నియోజకవర్గ అభివృద్ధి, మౌలిక సదుపాయాల విస్తరణ, ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన పలు అంశాలను వారి దృష్టికి తీసుకెళ్లారు.

**››› పెండింగ్ పనులకు ప్రత్యేక బడ్జెట్ నిధులు కోరిన ఎమ్మెల్యే**

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసి నియోజకవర్గంలో పెండింగ్ లో ఉన్న రహదారులు, భవనాలు, తాగునీటి పథకాలు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధి పనులకు ప్రత్యేక బడ్జెట్ నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే కోరారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

**››› ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధిపై మంత్రి సీతక్కకు వినతి**

గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కను కలిసి గిరిజన, ఏజెన్సీ ప్రాంతాల్లో అంతర్గత రహదారుల నిర్మాణం, తాగునీటి సమస్యల మిగతా 2 లో...

## శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు



- భద్రాచలం డీఎస్పీ అరుణ్‌కుమార్
- అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు లాడ్జీల్లో ఆకస్మిక తనిఖీలు చేసిన పోలీసులు

**భద్రాచలం టౌన్ , జూన్ 11 , ప్రజా జ్యోతి :** శాంతి భద్రతలకు విఘాతం కలిగించే అనుమానిత వ్యక్తులు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులే ధ్యేయంగా సోదాలు చేపట్టామని డిఎస్పి అరుణ్ కుమార్ తెలిపారు. భద్రాచలం పట్టణంలోని వివిధ లాడ్జిలతో పాటు స్థానిక బస్టాండ్ పరిసర ప్రాంతాలలో ఈ తనిఖీలు కొనసాగాయి. ఫింగర్ ప్రింట్ డివైజ్‌లు, డాగ్ స్క్వాడ్ బృందాలతో లాడ్జిలను క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. సోదాల సమయంలో లాడ్జిల్లో యజమానులు, మేనేజర్లు, సిబ్బంది పూర్తి వివరాలు సేకరించి, లాడ్జిలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. సీసీ టీవీ ఫుటేజ్ కనీసం మిగతా 2 లో...

## అవగాహనతోనే ఆరోగ్య భద్రత

- సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి
- డిప్యూటీ డీఎంహెచ్ఓ డా. శ్రీధర్



**చర్ల, జూన్ 11 :(ప్రజాజ్యోతి):** వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధుల నివారణపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డా. శ్రీధర్ ఆరోగ్య సిబ్బందికి సూచించారు. గురువారం ఆయన చర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఆరోగ్యశాఖ అమలు చేస్తున్న కార్యక్రమాలను సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలంలో మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వంటి వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. దోమల నివారణకు ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో మిగతా 2 లో...

## భవిష్యత్ తరాల సహజ వనరులు కాపాడుకోవడానికి సమిష్టి కృషి అవసరం

- పర్యావరణ పరిరక్షణలో ఐటీసీ, భాగస్వామ్య సంస్థల కృషి అభినందనీయం
- జిల్లా అటవీశాఖ అధికారి కృష్ణగౌడ్



**బూర్గంపహాడ్, జూన్ 11 (ప్రజా జ్యోతి):** భవిష్యత్ తరాల కోసం సహజ వనరులను కాపాడుకోవడంతో పాటు పచ్చదనాన్ని పెంపొందించుకోవడం, వన్యప్రాణుల ఆవాసాలను రక్షించడం కోసం సమిష్టి కృషి అవసరమని జిల్లా అటవీశాఖాధికారి కృష్ణగౌడ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని ఐటీసీ కర్మాగారంలో ఐటీసీ మిషన్ సునెరె కల్ ఆధ్వర్యంలో ఆటవీశాఖ సహకారంతో ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మిగతా 2 లో...

## అవగాహనతోనే ఆరోగ్య భద్రత

(మొదటి పేజీ తరువాయి...)

పాటు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు తెలియజేయాలని కోరారు. ప్రతి శుక్రవారం నిర్వహించే "ఫ్రైడే డ్రైడే" కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించి, దోమల ఉత్పత్తి కేంద్రాలను గుర్తించి నిర్మూలించే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇంటి పరిసరాల్లో పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, కూలర్లు, నీటి డబ్బాలు తదితర వస్తువుల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరిగేలా ప్రత్యేక దృష్టి సారించాలని, గర్భిణీలకు నార్మల్ డెలివరీల ప్రాధాన్యతపై అవగాహన కల్పించాలని తెలిపారు. తల్లి, శిశు ఆరోగ్య సంరక్షణకు సంబంధించిన సేవలను మరింత మెరుగ్గా అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. వర్షాకాలంలో వరదలు సంభవించే అవకాశాలు ఉన్న నేపథ్యంలో అధికారులు, ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. ఆరోగ్య శాఖ అమలు చేస్తున్న కార్యక్రమాల పురోగతిని సమీక్షించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డా. హారిక, ఆర్‌బీఎస్‌కే వైద్యులు డా. సందీప్, డా. జ్ఞానస్ఫూర్తి, హోమియోపతి వైద్యురాలు డా. పూజ, డీపీఎంఓ పాయం శ్రీనివాసరావు, సీహెచ్‌ఓ రామలక్ష్మి , సబ్ యూనిట్ ఆఫీసర్ ధర్మారావు, హెచ్ఈఓ గొంది వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇంటర్ లో ఉత్తమ ఫలితాలు సాధించిన ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు..




**టేకులపల్లి, జూన్11, ప్రజాజ్యోతి:** ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం సప్లమెంటరీ పరీక్షా ఫలితాల్లో మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లోనూ ద్వితీయ సంవత్సరం, ప్రథమ సంవత్సరం విద్యార్థుల తమ మార్కులు మెరుగు పరచుకోవాలని పట్టుదలతో ఇంప్రూమెంట్ పరీక్షలు రాసి మునుపటి కంటే మెరుగైన మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరంలో పరీక్షలు రాసిన మొత్తం విద్యార్థులు 135 మంది అయితే 124 మంది ఘన విజయం సాధించారు. కళాశాల 92 శాతం ఉత్తీర్ణత సాధించి ప్రభుత్వ కళాశాల అంటే శభాష్ కనిపించారు. ఈ ఫలితాలను టాపర్లుగా నిలిచిన విద్యార్థులు వివరాలు ఎంపీసీ,వై.నిత్య శ్రీ 440/414,జె. యశ్వంత్ 440/410 మెరుగైన ఫలితాలు రాబట్టారు. బైపిసిలో 500/371లో కాపర్ గా నిలిచారు. ఈ విజయానికి కారణం విద్యార్థులు కఠోర శ్రమ,అధ్యాపక బృందం నిరంతర పర్యవేక్షణ ఫలితమే అని కళాశాల ప్రిన్సిపల్ ఎం.పవన్ కుమార్ గర్వంగా ప్రకటించారు.ప్రస్తుత విద్యా సంవత్సరానికి గానూ పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతోందని, గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ప్రిన్సిపాల్ పిలుపునిచ్చారు. లెక్చరర్ల అండ, ప్రభుత్వ వసతుల తోడు ఉంటే సాధించలేనిది ఏదీ లేదని టేకులపల్లి ప్రభుత్వ కళాశాల విద్యార్థుల ఫలితాలు నిరూపించి,మిగతా విద్యార్థులకు ఆదర్శంగా నిలిచారు.

# నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమంపై ఎమ్మెల్యే జారె ప్రత్యేక చొరవ





(మొదటి పేజీ తరువాయి...)

శాశ్వత పరిష్కారం, గ్రామీణ ప్రగతి నిధుల మంజూరు అంశాలపై చర్చించారు. వెనుకబడిన గ్రామాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

**››› యువతకు స్టేడియంలు – క్రీడా సదుపాయాల కోసం ప్రత్యేక ప్రతిపాదనలు**

మంత్రి అజహరుద్దీన్‌ను కలిసి నియోజకవర్గ యువతకు మెరుగైన అవకాశాలు కల్పించేందుకు ఆధునిక స్టేడియంల నిర్మాణం, క్రీడా మౌలిక వసతుల అభివృద్ధి, మైనారిటీ సంక్షేమ నిధుల కేటాయింపు అంశాలను ప్రస్తావించారు. యువత ప్రతిభను ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం సహకారం అందించాలని కోరారు.

**››› సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా బాధిత కుటుంబాలకు అండ**

హైదరాబాద్‌లోని తెలంగాణ సచివాలయంలో అశ్వారావుపేట నియోజకవర్గానికి చెందిన అనారోగ్య బాధితుల నుంచి స్వీకరించిన ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్‌ఎఫ్) దరఖాస్తులను ఎమ్మెల్యే సంబంధిత అధికారులకు అందజేశారు. అత్యవసర వైద్య సహాయం అవసరమైన పేద కుటుంబాలకు త్వరితగతిన ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్థికం గా వెనుకబడిన కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సహాయం అందించడంతో పాటు నిమ్స్ వంటి ప్రముఖ ఆసుపత్రుల్లో ఉచిత వైద్య సేవలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందన్నారు.

**››› ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం, అభివృద్ధి – సంక్షేమం – సేవలే లక్ష్యంగా ముందుకు**

ప్రజల సమస్యల పరిష్కారమే తన ప్రధాన బాధ్యత అని ఎమ్మెల్యే జారె ఆది నారాయణ స్పష్టం చేశారు. అశ్వారావుపేట నియోజకవర్గ ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు చేరేలా, అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం అయ్యేలా నిరంతరం ప్రభుత్వంతో సమన్వయం చేస్తూ పనిచేస్తానని పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజల ఆశయాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలు, మౌలిక సదుపాయాల కల్పన, వైద్య సహాయం, యువతకు అవకాశాల సృష్టి వంటి అంశాల్లో మరింత దూకుడుగా పని చేస్తూ అశ్వారావుపేట అభివృద్ధికి కొత్త దిశను చూపిస్తున్న ఎమ్మెల్యే జారె ఆది నారాయణ చర్యలు ప్రజల్లో విశేష ఆదరణ పొందుతున్నాయి.

## గిరిజన మ్యూజియం, భద్రగిరి మార్ట్ ల నిర్వహణ అభినందనీయం

(మొదటి పేజీ తరువాయి...)

ప్రారంభించిన భద్రగిరి మార్ట్ ,ట్రైబల్ మ్యూజియం మరియు కోయ ఇలవేల్పుల చరిత్ర ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ ప్రత్యేక శ్రద్ధతో ఏర్పాటు చేయడం అభినందించదగ్గ విషయమని తెలంగాణ ఇన్స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్మెంట్ సెంటర్ హెడ్ సుభాష్ చంద్ర గౌడ్ అన్నారు. గురువారం హైదరాబాద్ రాజేంద్రనగర్ లోని టీజీ ఆర్ ఐ డి సమావేశ మందిరములో గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో షెడ్యూల్డ్ ప్రాంతాలలో పీసా చట్టం అమలుపై నిర్వహిస్తున్న వర్క్ షాప్ లో వివిధ శాఖలకు సంబంధించిన ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుభాష్ చంద్ర గౌడ్ మాట్లాడుతూ అంతరించిపోతున్న ఆదివాసి గిరిజన సంస్కృతి సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు కట్టుబాట్లు నేటితరం యువతీ యువకులకు తెలిసేలా గిరిజన మ్యూజియం రూపొందించడం చాలా బాగుందన్నారు. గిరిజనుల గోత్రనామాలు వారి గట్లు తెలిసే విధంగా ఇలవేల్పుల చరిత్ర రూపొందించి నేటితరం ఆదివాసి గిరిజనులకు తెలియజేయడం సంతోషకరమని పేర్కొన్నారు. అలాగే గిరిజన మహిళలకు రైతులకు ఆర్థికంగా చేయూత అందించడానికి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 70 ఎస్ఎస్సి గ్రూపు మహిళలు, ఆదివాసి గిరిజన మహిళలు సూక్ష్మ చిన్న తరహా పరిశ్రమలు స్థాపించుకొని తయారు చేసిన మిల్లెట్ బిస్కెట్లు, ఇప్పపువ్వు లడ్లు, వివిధ రకాల పచ్చళ్ళు, తృణధాన్యాలు వినియోగదారులకు అందుబాటులో ఉంచడం అభినందనీయమన్నారు. ఐటీడీఏ పీవో గిరిజన సంక్షేమానికి పాటుపడుతున్న విధానాన్ని రాష్ట్రంలోని గిరిజన గ్రామాలలో గిరిజనుల కోసం పనిచేస్తున్న అధికారులు అమలు చేస్తే గిరిజనులు ఆర్థికంగా బలోపేతమై వారి కుటుంబాలను ఎటువంటి ఇబ్బందులు లేకుండా పోషించుకుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో పీసా అధికారి అశోక్ మరియు తెలంగాణ ఆదివాసి గిరిజన గ్రామాలలోని సర్పంచులు, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## భవిష్యత్ తరాల సహజ వనరులు కాపాడుకోవడానికి సమిష్టి కృషి అవసరం

(మొదటి పేజీ తరువాయి...)

జిల్లా అటవీశాఖ అధికారి కృష్ణగౌడ్తో పాటు అటవీ విభాగ అధికారి ఆర్.బాబు, ఐటీసీ యూనిట్ హెడ్ శైలేంద్రసింగ్, ఐటీసీ హెచ్ఆర్ జీఎం శ్యామి కిరణ్, డీజీఎం చెంగల్రావు, మిషన్ సునిరేకల్ ప్రతినిధులు గీతప్రవల్లిక, కుంటల్ సర్కార్లు పాల్గొని మాట్లాడారు. అటవీ వైవిధ్యీకరణ, పర్యావరణ పరిరక్షణ, జీవ వైవిధ్య సంరక్షణ ప్రాముఖ్యతను వివరించారు. ఐటీసీ సునిరేకల్ ప్రతినిధులు అమలుచేసిన, చేస్తున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రదర్శించగా వాటిని అటవీశాఖ జిల్లా అధికారి తిలకించి అభినందించారు. సామాజిక అటవీకరణ, సుస్థిర వ్యవసాయపద్ధతులు, అటవీ, సామూహిక భూముల జీవ వైవిధ్య పరిరక్షణ, రైతుల జీవనోపాధి అభివృద్ధి, ప్రాథమిక విద్య, మహిళా సాధికారిత, ఆరోగ్యం, పారిశుధ్యం, ఘనవ్యర్థాల నిర్వహణ, గ్రామీణ యువతకు వృత్తి నైపుణ్య శిక్షణ అంశాలను క్లుప్తంగా ప్రదర్శన రూపంలో వివరించారు. పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం మరింత పెంచాలని, ఇలాంటి కార్యక్రమాలు ప్రజల్లో అవగాహన కల్పించి అమలుచేయడం అభినందనీయమని ఐటీసీని అభినందించారు. అనంతరం జిల్లా అటవీశాఖ అధికారి ఐటీసీ ఉన్నతాధికారులతో కలిసి ఐటీసీ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఐటీసీ మేనేజర్లు, సునిరేకల్ ప్రతినిధులు, అటవీశాఖ రేంజ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు



(మొదటి పేజీ తరువాయి...)

రెండు నెలల పాటు బ్యాకప్ ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు. అలాగే లాడ్జి వెలుపల రహదారిపై వచ్చి పోయే వాహనాల కదలికలను స్పష్టంగా రికార్డు అయ్యేలా కెమెరాలను రోడ్డు వైపు అమర్చాలని ఆదేశించారు. పట్టణ ప్రజల భద్రత దృష్ట్యా ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని వెల్లడించారు. ఎవరైనా అనుమానస్పదంగా కనిపించినట్లయితే పోలీస్ వారికి తెలియజేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ తనిఖీల్లో సిఐ నాగరాజు, సబ్ ఇన్స్పెక్టర్లు, స్పెషల్ పార్టీ సిబ్బంది, మహిళా పోలీసులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంటర్ అడ్వాన్స్ ఫలితాలలోను లిటిల్ ఫ్లవర్స్ విద్యార్థులదే హావా

**భద్రాచలం టౌన్ , జూన్ 11 ప్రజాజ్యోతి** ఇంటర్మీడియట్ బోర్డు గురువారం విడుదల చేసిన అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలలోను లిటిల్ ఫ్లాట్స్ విద్యార్థులే మరోసారి హవా కొనసాగించి పై చేయి సాధించారు. ఇటీవల విడుదల చేస్తున్న ఎంసెట్ మెయిన్స్ అడ్వాన్స్ పోటీ పరీక్షలలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అగ్రస్థానంలో నిలిచిన విద్యార్థులు అడ్వాన్స్ సప్లిమెంటరీ లోను అదే హావ కొనసాగించారు. ఎంపీసీ విభాగంలో డి జోషిక 469/470 మార్కులు సాధించి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మొదటి స్థానంలో నిలిచారు. అదేవిధంగా జి ప్రైసి ఫియోనా 469/470 టి దేవేంద్ర రెడ్డి 469/470 మార్కులు సాధించి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అగ్రస్థానంలో నిలిచారు అంతేకాకుండా ఎం నిఖిల్ 468/470 కె విశ్వనాథ్ 468 /470 సాధించగా మరో ముగ్గురు విద్యార్థులు 467/470 మార్కులతో సత్తా చాట్టారు అంతేకాకుండా 466/470 మార్కులు సైతం ముగ్గురు విద్యార్థులు సాధించి భద్రాచలం డివిజన్ పేరుని ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా వినిపింపజేశారు. బైపిసి విభాగంలోనూ లిటిల్ ఫ్లవర్స్ విద్యార్థులతే పైచేయని చెప్పాలి బైపిసి విద్యార్థులైన టీచంద్రిక 438/440కె లక్ష్మీరాజశ్రీ ప్రణయ్ సాయి 438/440 ఎంఈసి విభాగంలో యు అనన్య 491/500 కె తనిష్కమని 468/500 సి ఈ సి విభాగంలో భవన్ కుమార్ హాన్ 472/500 డి నిషిత రెడ్డి నల 472/500 మార్కులతో కని వీని ఎరగని సంచలనాలకు కేంద్ర బిందువుగా నిలిచారు. ఈ సందర్భంగా లిటిల్ ఫ్లవర్స్ కళాశాల ఆవరణలో నిర్మించిన అభినందన సభలో లిటిల్ ఫ్లవర్స్ విద్యా సంస్థల డైరెక్టర్లు మాగంటి శ్రీనివాస వరప్రసాద్ మాగంటి రమేష్ బాబు లు విద్యార్థులను అభినందించి మాట్లాడుతూ సీనియర్ ఇంటర్ ఫలితాలలో 994 మార్కులతో సంచలనాలను సృష్టించిన మా విద్యార్థులు ఎంసెట్ ఫలితాలలోను అదే వరవడిని కొనసాగించారని అన్నారు. జేఈ మెయిన్స్ అడ్వాన్స్ ఫలితాలలోను అత్యుత్తమ ర్యాంకులు సాధించి చరిత్ర సృష్టించారని అన్నారు. ర్యాంకులతోపాటు ఎంసెట్ మెయిన్స్ ఫలితాలలో అత్యధిక పర్సెంటేజ్ సాధించిన విద్యార్థుల సంఖ్య దక్కుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు బషీర్ తో పాటు బోధన బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు

# ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించండి

- **మండల విద్యాశాఖాధికారి పి.వి. రమణ**



**చర్ల, జూన్ 11 (ప్రజాజ్యోతి):** ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా గురువారం జంగాలపల్లి గ్రామంలో బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించే లక్ష్యంతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జంగాలపల్లి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తేగడ పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయురాళ్లు పాల్గొని గ్రామంలో ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యాన్ని వివరించారు.ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి పి.వి. రమణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే నాణ్యమైన విద్యాబోధన జరుగుతోందని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోకుండా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు, ఆధునిక బోధనా విధానాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫారాలు, రుచికరమైన మధ్యాహ్న భోజనం, అల్పాహార పథకం వంటి సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాలను వినియోగించుకొని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు చెల్లించడం వల్ల కుటుంబాలపై ఆర్థిక భారం పడుతుందని, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు ఆర్థిక భారం తగ్గుతుందని వివరించారు.గత విద్యా సంవత్సరంలో చర్ల మండలంలో పదో తరగతి ఫలితాలు రికార్డు స్థాయిలో నమోదయ్యాయని, 96 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. తేగడ పాఠశాల విద్యార్థులు మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించి పాఠశాల ప్రతిష్ఠను పెంచారని పేర్కొన్నారు. జంగాలపల్లి హ్యాబిటేషన్ తేగడ గ్రామపంచాయతీ పరిధిలోకి వస్తున్నందున స్థానిక విద్యార్థులను తేగడ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని సూచించారు.అదేవిధంగా చదువును మధ్యలో మానేసిన డ్రాపౌట్ విద్యార్థులను గుర్తించి తిరిగి పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. పేద వెనుకబడిన వర్గాల విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలే ఉత్తమ వేదికగా నిలుస్తున్నాయని అన్నారు.ప్రభుత్వం విద్యారంగంలో అనేక సంస్కరణలు అమలు చేస్తోందని, విద్యార్థుల కోసం కొత్త పథకాలు ప్రవేశపెడుతోందని తెలిపారు. ఇంటర్మీడియట్ వరకు మధ్యాహ్న భోజన పథకం, విద్యార్థులకు అవసరమైన షూస్, కిట్లు తదితర సదుపాయాలు అందజేస్తూ ప్రభుత్వ పాఠశాలలను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నట్లు వెల్లడించారు.విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలనే ఎంపిక చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి పి.వి. రమణ విజ్ఞప్తి చేశారు.


## భద్రాద్రి రామయ్యకు నిత్యకల్యాణం



**భద్రాచలం టౌన్, జూన్ 11, ప్రజాజ్యోతి,** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో గురువారం స్వామి వారి కల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేనార్చన, పుణ్యాహవచనం, కంకణధారణ, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనం నిర్వహించారు.

## భద్రాచలంలో అధ్వానంగా పారిశుద్ధ్యం

- **కాలనీల్లో కాల్వలు పూడిక తీయక రోడ్లపైకి వస్తున్న మురుగునీరు**



**భద్రాచలం టౌన్, జూన్ 11, ప్రజాజ్యోతి** భద్రాచలంలో పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైందని కాలనీ వాసులు పేర్కొంటున్నారు. ప్రధాన వీధుల్లోనే పారిశుద్ధ్య చర్యలు చేపడుతూ కాలనీల్లో సిబ్బంది సరిగా వెళ్లక ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతోందని పలు కాలనీవాసులు వాపోస్తున్నారు. భగవాన్‌దాస్ కాలనీ, లంబాడీ కాలనీ, ఎంపీ కాలనీ, అశోకనగర్ కొత్త కాలనీ ఇలా పలు కాలనీల్లో మురుగునీరు కాల్వల్లో పేరుకుపోయి పూడిక తీయకపోవడంతో ఆ నీరంతా రోడ్లపైకి చేరుతోంది. సీతారామ నగర్ కాలనీ మాజీ ఎమ్మెల్యే సున్నం రాజయ్య వీధిలోని కాల్వల్లో బుధవారం రాత్రి కురిసిన వర్షానికి మురుగునీరంతా రోడ్లపైకి చేరింది. దీంతో కాలనీవాసులు గ్రామ పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదు. కొన్ని చోట్ల కాల్వలు పాతకా లం నాటివి కావడం కూడా ఇప్పుడున్న ఇళ్లకు సరిపోవడం లేదు. వాటిని తిరిగి నిర్మించాల్సి ఉంది. రాబోయే వర్షాకాలన్ని దృష్టిలో ఉంచుకొని తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## బీఎల్‌ఏల శిక్షణను విజయవంతం చేయండి

- **మండల అధ్యక్షుడు విజయ్ నాయుడు పిలుపు**



**చర్ల, జూన్ 11: (ప్రజాజ్యోతి):** కాంగ్రెస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు), పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల కోసం నిర్వహించనున్న శిక్షణా కార్యక్రమానికి పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ చర్ల మండల అధ్యక్షుడు విజయ్ నాయుడు పిలుపునిచ్చారు.ఈ నెల 12న భద్రాచలం ఏపి టూరిజం లో నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమానికి భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు.ఈ సందర్భంగా విజయ్ నాయుడు మాట్లాడుతూ, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి బూత్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజల సమస్యలను గుర్తించి పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, సంక్షేమ కార్యక్రమాలు, ప్రభుత్వ ప్రజాహిత పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో బీఎల్ఏలు, పార్టీ కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. శిక్షణా కార్యక్రమం ద్వారా ఎన్నికల నిర్వహణ, ఓటర్ల జాబితా సవరణ, పార్టీ బలోపేతం తదితర అంశాలపై అవగాహన పెంపొందుతుందని పేర్కొన్నారు.కావున మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, బీఎల్ఏలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజయ్ నాయుడు విజ్ఞప్తి చేశారు.

## బీజేపీ జిల్లా కార్యవర్గంలో గూనూరి రమణ



**చర్ల, జూన్ 11 (ప్రజాజ్యోతి):** చర్ల మండలానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు గూనూరి రమణకు పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీలో ప్రాధాన్యత కల్పించారు. ఆయనను జిల్లా కార్యవర్గ సభ్యుడిగా నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి గురువారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు.పార్టీ బలోపేతం కోసం ఎన్నో సంవత్సరాలుగా కృషి చేస్తున్న గూనూరి రమణ సేవలను గుర్తించిన పార్టీ నాయకత్వం ఆయనకు ఈ బాధ్యతలను అప్పగించినట్లు తెలుస్తోంది. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో, వివిధ సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ పార్టీ అభివృద్ధికి తోడ్పడుతున్న రమణకు జిల్లా కమిటీలో చోటు దక్కడం పట్ల స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేశారు. తనపై విశ్వాసం ఉంచి కీలక బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి గూనూరి రమణ ధన్యవాదాలు తెలిపారు. పార్టీ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ నాయకత్వం నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని ఆయన అన్నారు. గూనూరి రమణకు జిల్లా కార్యవర్గ సభ్యుడిగా అవకాశం కల్పించడాన్ని చర్ల మండల బీజేపీ శ్రేణులు స్వాగతిస్తూ, ఆయనకు అభినందనలు తెలియజేశారు. పార్టీ అభివృద్ధిలో మరింత కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే జారే ప్రత్యేక చొరవ

- **గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో నిత్య ప్రజాపాలన**





**దమ్మపేట, జూన్11, (ప్రజాజ్యోతి):** దమ్మపేట మండలంలోని గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రతీరోజు ప్రజాపాలన కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారుల సమస్యలను ఓర్పుగా విని, వారి ఇబ్బందులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలు సమర్పించిన వినతిపత్రాలను పరిశీలించిన ఎమ్మెల్యే, అత్యవసర సమస్యల పరిష్కారం కోసం వెంటనే సంబంధిత శాఖల అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా చూడాలని, సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదని అధికారులకు సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారమే తన ప్రథమ కర్తవ్యమని పేర్కొన్న ఎమ్మెల్యే, నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సంక్షేమం కోసం కృషి చేస్తానని తెలిపారు. ప్రజాపాలన కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వేగవంతంగా పరిష్కరించే అవకాశం కలుగుతుందని ఆయన అన్నారు.

## ఎంఈఓ కార్యాలయం వర్షానికి జలమయం

- **పట్టించుకునే అధికారే లేరా..!**



**టేకులపల్లి, జూన్ 11, ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలం విద్యాశాఖ అధికారి కార్యాలయం బుధవారం రాత్రి కురిసిన వర్షపు నీటితో జలమయంగా మారిపోయింది.మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం శిథిలావస్థలో ఉండడమే కాకుండా,వర్షం పడితే నీరు నిలవడం అదేపనిగా కొనసాగుతుంది. ఎంపీడీవో కార్యాలయంకు అనుకొని ఉన్న విద్యా కార్యాలయం ఉండడం తెలిసిందే.. ఉన్నత అధికారులు నూతన భవనాన్ని మంజూరు చేసి టేకులపల్లి మండలంలో విద్యా వ్యవస్థను పటిష్టంగా చేయాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు. ఇబ్బంది పడే పరిస్థితి నుండి విముక్తి కల్పించాలని ప్రజలు ఉన్నతాధికారులను వేడుకుంటున్నారు.

## ఇంటర్ సప్లిమెంటరీలో 'త్రివేణి' ప్రభంజనం

- **వరుసగా రెండో ఏడాది స్టేట్ ఫస్ట్ ర్యాంక్**



**భద్రాచలం టౌన్, జూన్ 11, ప్రజా జ్యోతి,** తెలంగాణ ఇంటర్మీడియట్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ ఫలితాల్లో భద్రాచలం త్రివేణి జూనియర్ కళాశాల విద్యార్థు లు జయకేతనం ఎగురవేశారు. గత ఏడాది మాదిరిగానే ఈ సంవత్సరం కూడా రాష్ట్ర స్థాయి ప్రథమ ర్యాంకును కైవసం చేసుకుని, త్రివేణి తన విజయ పరంపరను దిగ్విజయంగా కొనసాగించింది.

**చందు రికార్డు సృష్టి...**నేడు వెలువడిన ఫలితాల్లో ఎంపీసీ విభాగంలో వి. చందు 470 మార్కులకు గాను 468 మార్కులు సాధించి, రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచాడు. తద్వారా భద్రాచలం డివిజన్ టాపర్‌గా రికార్డు సృష్టించాడు. ఇదే విభాగంలో బి. డింపుల్ 460, కె. ప్రణదీప్ 456 మార్కులు సాధించి కళాశాల కీర్తిని ఇనుమడింపజేశారు. వందలాది మంది విద్యార్థులు 400లకు పైగా మార్కులు సాధించి ఉత్తీర్ణులయ్యారని కళాశాల చైర్మన్ కోడూరి సత్యనారాయణ తెలిపారు. ఈ ఘన విజయం సాధించిన విద్యార్థులను చైర్మన్ కోడూరి సత్యనారాయణ, డైరెక్టర్ కోడూరి ప్రశాంతి, ప్రిన్సిపాల్ మరియు అధ్యాపక బృందం ప్రత్యేకంగా అభినందించారు.

**అధునాతన 'సీబీటీ' విధానంతో శిక్షణ...**విద్యార్థులను జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీ పరీక్షలకు సిద్ధం చేసేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించినట్లు చైర్మన్ కోడూరి సత్యనారాయణ వెల్లడించారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ఈఏపీసెట్ , జేఈఈ , నీట్ కోచింగ్‌తో పాటు.. ఫైనల్ పరీక్షల తరహాలోనే విద్యార్థులకు అవగాహన కల్పించేలా అత్యాధునిక లాబ్‌లలో 'సీబీటీ' మోడల్ గ్రాండ్ ప్రాక్టీస్ టెస్ట్‌లను నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. దీనికోసం కళాశాల ప్రాంగణంలోనే ప్రత్యేక వసతులను సిద్ధం చేశామని తెలిపారు.

## రాజ్యసభ ఎన్నికల్లో ఆర్వో నిర్ణయం చట్టవిరుద్ధం

- **భద్రాద్రి డీసీసీ ఉపాధ్యక్షులు గోడిశాల రామనాధం**



**పినపాక,జూన్ 11(ప్రజాజ్యోతి)**మధ్యప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్ చార్జ్ మీనాక్షి నటరాజన్ దాఖలు చేసిన నామినేషన్ ను తెలంగాణలో కేసు ఉందనే ఆరోపణలతో తిరస్కరించడం చట్టవిరుద్ధమని భద్రాద్రి జిల్లా డీసీసీ ఉపాధ్యక్షులు గోడిశాల రామనాధం తీవ్రంగా ఖండించారు.ఈ సందర్భంగా ఆయన గురువారం పినపాక మండలం ఈ. బయ్యారం క్రాస్ రోడ్ లో గల పార్టీ మాట్లాడుతూ, రిటర్నింగ్ అధికారి (ఆర్వో) తీసుకున్న నిర్ణయం పూర్తిగా చట్టవిరుద్ధమని, వెంటనే ఆ నిర్ణయాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మీనాక్షి నటరాజన్ పై ఎలాంటి క్రిమినల్ కేసులు లేవని, అలాంటప్పుడు ఆమె ఏ విషయాన్ని దాచారని నామినేషన్ ను తిరస్కరించారో స్పష్టం చేయాలని ప్రశ్నించారు.కేంద్రంలోని NDA ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు. మధ్యప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల్లో తగిన సంఖ్యాబలం లేకపోయినా మూడో అభ్యర్థిని బరిలోకి దింపడం, అదే క్రమంలో కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్ ను తిరస్కరించడం బీజేపీ కుట్రలో భాగమేనని విమర్శించారు.ప్రజాస్వామ్య వ్యవస్థలను దుర్వినియోగం చేసే ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో కేంద్రం మరియు రాష్ట్రంలో బీజేపీకి తగిన గుణపాఠం చెబుతామని గోడిశాల రామనాధం హెచ్చరించారు.ఈ సమావేశం లో పినపాక సర్పంచ్ అలివేలు,కోడిరెక్కల సాయి, స్వతంత్ర రెడ్డి,పినపాక ఉప సర్పంచ్ తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

## పోక్సో, బాల కార్మిక నిషేధ చట్టాలపై అవగాహన సదస్సు

- **చిన్నారుల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి : జడ్జి భవాని**



**దమ్మపేట, జూన్.11, (ప్రజాజ్యోతి) :**చిన్నారుల భద్రత, హక్కుల పరిరక్షణతో పాటు బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు దమ్మపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో దమ్మపేట జ్యుడీషియల్ కోర్టు జడ్జి భవాని ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. పోక్సో చట్టం, బాల కార్మిక నిషేధ చట్టాల ప్రాముఖ్యతను వివరిస్తూ చిన్నారుల సంక్షేమానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని జడ్జి భవాని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జడ్జి భవాని మాట్లాడుతూ, పిల్లల భద్రత, వారి హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. చిన్నారులపై లైంగిక వేధింపులు, దాడులను అరికట్టేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన పోక్సో చట్టం అత్యంత కీలకమైందని తెలిపారు. బాలలను పనుల్లో పెట్టడం చట్టరీత్యా నేరమని, బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రజలు సహకరించాలని సూచించారు.చిన్నారుల హక్కులను కాపాడటంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆమె పిలుపునిచ్చారు. పిల్లలకు విద్య, రక్షణ, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడమే సమాజ పురోగతికి పునాది అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై బాలస్వామి, సర్పంచ్ రమాదేవి, కోర్టు సిబ్బంది ,లాయర్ మురళీమోహన్, గ్రామపంచాయతీ కార్యదర్శి అనంత్ కుమార్ తదితరులు పాల్గొని పోక్సో చట్టం, బాల కార్మిక నిషేధ చట్టాల ప్రాముఖ్యతను వివరించారు. చట్టాలపై ప్రజల్లో అవగాహన పెంపొందితేనే బాలలపై నేరాలను సమర్థవంతంగా అరికట్టగలమని తెలిపారు.ఈ కార్యక్రమంలో కోర్టు సిబ్బంది, గ్రామపంచాయతీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సాయిబాబా ఆలయానికి రిక్షా విరాళం

- **మాజీ ఎంపీటీసీ దేవరపల్లి అజయ్ కుమార్ సేవాభావం అభినందనీయం : మెచ్చా**



**దమ్మపేట, జూన్.11, (ప్రజాజ్యోతి) :** దమ్మపేట మండలం మందలపల్లి గ్రామంలో ఉన్న శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయానికి మాజీ ఎంపీటీసీ దేవరపల్లి అజయ్ కుమార్ తన సొంత నిధులతో రిక్షాను విరాళంగా అందజేసి సేవాభావాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి మెచ్చా నాగేశ్వరరావు స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.అనంతరం ఆలయ ట్రస్ట్ ప్రతినిధులకు రిక్షాను అందజేశారు. ఈ సందర్భంగా మెచ్చా నాగేశ్వరరావు మాట్లాడుతూ, సాయిబాబా ఆలయ అవసరాలకు, స్వామివారి నిత్య సేవా కార్యక్రమాలకు ఈ రిక్షా ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఆలయ అభివృద్ధికి తోడ్పాటుగా ముందుకొచ్చి స్వచ్ఛందంగా రిక్షాను విరాళంగా అందించిన మాజీ ఎంపీటీసీ దేవరపల్లి అజయ్ కుమార్‌ను ప్రత్యేకంగా అభినందించారు.భక్తి, సేవాభావంతో ఆలయాల అభివృద్ధికి ప్రజలు సహకరించడం సమాజానికి ఆదర్శంగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాసిని శ్రీను, వెలుగోటి మహేష్, అబ్దుల్ జిన్నా, దండాబత్తుల కాంతారావు, దొద్దుల వెంకన్న, మడిపల్లి పోలరాజు, కొండ్రముచ్చు నాగరాజు, కోళ్ళ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆశా వర్కర్లకు ప్రథమ చికిత్సపై అవగాహన సదస్సు



**ఆళ్ళపల్లి.జూన్11(ప్రజా జ్యోతి)** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం 108 అంబులెన్స్ సిబ్బంది ఆశా వర్కర్లకు ప్రథమ చికిత్సపై అవగాహన సదస్సు నిర్వహించారు 108 ఈఎంటి పరమ ఆకాశ్ మాట్లాడుతూ, ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి వెంటనే ప్రథమ చికిత్స అందించడం, సిపిఆర్ చేయడం, అత్యవసర వైద్య పరికరాలను వినియోగించే విధానంపై ఆశా వర్కర్లకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఆశా వర్కర్లు ప్రథమ చికిత్సపై పూర్తి అవగాహన కలిగి ఉంటే గ్రామాల్లో అత్యవసర సమయంలో ఎంతో మంది ప్రాణాలను కాపాడవచ్చని పేర్కొన్నారు 108 జిల్లా సమన్వయకర్త సతీష్ కుమార్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఆయన వివరించారు. 108 సేవల ద్వారా ఇప్పటివరకు అనేకమంది క్షతగాత్రులను, గర్భిణీ స్త్రీలను ప్రాణాపాయ స్థితి నుండి కాపాడామని తెలిపారు. ఏదైనా ఎమర్జెన్సీ వచ్చినప్పుడు వెంటనే 108కు కాల్ చేయాలని, 24 గంటలూ ఆళ్లపల్లి ఆసుపత్రి వద్ద అంబులెన్స్ అందుబాటులో ఉంటుందని సూచించారు. ఆసుపత్రిలో విధులు నిర్వహించే ఆశా వర్కర్లకు కూడా ఈ అవగాహన సదస్సు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు ఈ కార్యక్రమంలో 108 పైలట్ పరమ సునీల్ కుమార్, పలువురు ఆశా వర్కర్లు కావేరి,కృష్ణకుమారి, లక్ష్మీకాంత, సుందరమ్మ, సత్యవతి, రాంబయ్, బాలమ్మ, తిరుపతమ్మ పాల్గొన్నారు.

## ఫీజుల పేరిట ఫ్యాక్టరీలా విద్యా వ్యాపారం..!

- **కార్పొరేట్ స్కూళ్ల దోపిడీపై ఏఐఎస్ఎఫ్ ఆగ్రహం**
- **విద్యా హక్కు చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలంటూ డిమాండ్**



**కొత్తగూడెం, జూన్ 11 (ప్రజాజ్యోతి):** జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు అధిక ఫీజుల పేరుతో తల్లిదండ్రులను దోచుకుంటున్నాయని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జిల్లా సమితి ఆరోపించింది. ఈ దోపిడీని తక్షణమే అరికట్టాలని కోరుతూ గురువారం ఏడీఈఓ శ్యామ్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్కే షాహిద్, జిల్లా కార్యదర్శి వరక అజిత్ మాట్లాడుతూ జిల్లాలోని పలు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలను పట్టించుకోకుండా విద్యార్థుల నుంచి భారీ మొత్తాల్లో ఫీజులు వసూలు చేస్తున్నాయని మండిపడ్డారు. పాఠశాలల్లోనే పాఠ్యపుస్తకాలు, స్టేషనరీ, టైలు, బెల్టులు, యూనిఫాంలు, షూల ను అధిక ధరలకు విక్రయిస్తూ విద్యను పూర్తిస్థాయి వ్యాపారంగా మార్చేశారని విమర్శించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పూర్తిగా ఏజెన్సీ ప్రాంతం కావడంతో ఇక్కడి పేద, మధ్యతరగతి కుటుంబాలపై అదనపు ఆర్థిక భారం పడుతోందన్నారు. విద్యా హక్కు చట్టాన్ని జిల్లాలో పటిష్టంగా అమలు చేసి అధిక ఫీజుల వసూళ్లకు అడ్డుకట్ట వేయాలని జిల్లా కలెక్టర్, విద్యాశాఖ అధికారులను కోరారు.

ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శులు ఇనపల్లి పవన్ సాయి, మాణిక్యాల వినయ్, జిల్లా ఉపాధ్యక్షుడు కొరిమి సంజయ్, నాయకులు కళ్యాణ్, నవీన్, మహేష్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.